పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 746 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ గురువారం 15.10.2026 పేజీలు : 6 వెల : 4/-


## దుర్గమ్మ సేవలో

# రాష్ట్రపతి ముర్ము...

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము



2లో

## ఏపీ స్థానిక ఎన్నికల నగారా..

# మూడు దశల్లో పోలింగ్

- తొలి దశ నవంబర్ 26న పోలింగ్
- మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు
- మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న
- మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా కాకినాడలో నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సు విజయవంతమైంది. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి తరువాయి 2లో




## రైల్వే ఉద్యోగులకు

# 78 రోజుల వేతనం బోనస్



- కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయానికి ఆమోదం
- సుమారు 11.40 లక్షల మంది నాన్-గెజిటెడ్ సిబ్బందికి లబ్ధి
- ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చొప్పున చెల్లింపు
- పనితీరును ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయమన్న రైల్వే శాఖ

దసరా, దీపావళి పండగల సీజన్‌కు ముందు భారతీయ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైల్వే శాఖలోని నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు 11.40 లక్షల తరువాయి 2లో

## మళ్లీ భగ్గుమన్న క్రూడ్..

# 110 డాలర్ల దిశగా పరుగు

- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలతో పెరుగుతున్న ముడిచమురు ధరలు
- సౌదీ అరేబియాపై హౌతీల దాడులతో సరఫరాపై ఆందోళన
- ధరల పెరుగుదలతో భారత్‌పై ఆర్థిక భారం, ద్రవ్యోల్బణం ముప్పు
- హర్మూజ్ జలసంధిలో రవాణా అనిశ్చితి కూడా ఓ కారణం



అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మరోసారి భగ్గుమంటున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా సరఫరాపై ఆందోళనలు పెరగడంతో, క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల సమీపానికి దూసుకెళ్తోంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 106.58 డాలర్ల వద్ద ఉండగా, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 94.94 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు జరగడం, వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో రవాణాకు తరువాయి 2లో

## రైళ్లు ఆపలేదు

### సుప్రీంకు

# ఢిల్లీ మెట్రో వెల్లడి

- మొత్తం 303 స్టేషన్లలో 57 మాత్రమే మూసివేసినట్లు వెల్లడి
- షెడ్యూల్ ప్రకారం 4,157 ట్రిప్పులు నడిపినట్లు స్పష్టం
- సేవల కోత వల్ల కాదని, నిరసనల కారణంగానే ప్రయాణికులు తగ్గారని వివరణ

2లో



# పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం




- ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో 31 దేశాల సిబ్బందిపై నిషేధం
- ఇజ్రాయెల్ నిబంధనలను పాటిస్తున్నట్లు ప్రకటించిన ఎయిర్ ఫ్రాన్స్
- ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం తర్వాత కఠిన నిర్ణయం
- ఈ నిర్ణయం ఫ్రెంచ్ ఉపాధి చట్టాలకు విరుద్ధమంటూ ఆందోళనలు

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య తరువాయి 2లో

## భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

- నిజ్జర్ హత్య తర్వాత భారత్‌తో సంబంధాలు మెరుగుపడ్డాయన్న మంత్రి
- ఖలిస్తానీ నినాదాలపై సమతుల్యం పాటించాల్సి ఉందన్న అనితా ఆనంద్
- బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన కెనడా ప్రభుత్వం
- డిసెంబర్‌లో కెనడాలో ప్రధాని మోదీ పర్యటించే అవకాశం

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్ కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నా తరువాయి 2లో





2లో

## భారత్‌పై ఐఎస్ఐ 'డిజిటల్ జిహాద్'...

# నిరసనలే లక్ష్యంగా 5వేల ఫేక్ అకౌంట్లతో కుట్ర!

- గత రెండు వారాల్లోనే 5వేలకు పైగా ఫేక్ సోషల్ మీడియా ఖాతాల సృష్టి
- 'సర్' నిరసనలను ఆసరాగా చేసుకుని హింసను ప్రేరేపించేందుకు కుట్ర
- కొత్త పంథాలో ఐఎస్ఐ.. చిన్న పట్టణాల నుంచి ఫేక్ న్యూస్ వ్యాప్తి
- కొందరు భారతీయులకు డబ్బులిచ్చి దేశ వ్యతిరేక ప్రచారం

# రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనం కానుక

దసరా, దీపావళి పండగల సీజన్‌కు ముందు భారతీయ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైల్వే శాఖలోని నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు 11.40 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఈ బోనస్ రైల్వే శాఖలోని గ్రూప్‌సి ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్ వంటి కీలక సిబ్బంది ఉన్నారు. రైల్వేలలో వీరి పాత్రను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. బోనస్‌ను 78 రోజుల వేతనంగా లెక్కించినప్పటికీ, చెల్లింపుల పరిమితుల ప్రకారం ప్రతి ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 మాత్రమే అందుతుంది. 202526 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈ బోనస్‌ను ఖరారు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేస్ రికార్డు స్థాయిలో 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, సుమారు 741 కోట్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చింది. ఉద్యోగుల అంకితభావం, కృషిని గుర్తించి వారిలో స్ఫూర్తిని నింపేందుకే ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మెరుగైన పనితీరు కనబరిచేలా సిబ్బందిని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. బోనస్ చెల్లింపుల కోసం అవసరమైన నిధులను ఇప్పటికే కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. పండగల వేళ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైల్వే ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దుర్గమ్మ సేవలో రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఏపీ స్థానిక ఎన్నికల నగారా.. మూడు దశల్లో పోలింగ్

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పుణేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది. తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ULB) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

## మళ్లీ భగ్గుమన్న క్రూడ్.. 110 డాలర్ల దిశగా పరుగు

అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మరోసారి భగ్గుమంటున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా సరఫరాపై ఆందోళనలు పెరగడంతో, క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల సమీపానికి దూసుకెళ్తోంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 106.58 డాలర్ల వద్ద ఉండగా, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 94.94 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు జరగడం, వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో రవాణాకు ముప్పు పొంచి ఉండటం వంటి పరిణామాలు ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. అక్టోబరు 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో పరిపాలన భవనంపై అనుమానిత దాడి జరగడం, స్వల్పంగా అగ్నిప్రమాదం సంభవించడంతో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుల్లో ఒకటైన సౌదీలో భద్రతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. మరోవైపు, ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో ట్యాంకర్లపై దాడులు జరుగుతాయేమోనన్న భయాలు సరఫరా గొలుసును దెబ్బతీస్తున్నాయి. ఇక్కడి అనిశ్చితి కారణంగా రవాణా ఆలస్యమైతే, ఉత్పత్తి సాధారణంగా ఉన్నప్పటికీ మార్కెట్‌లో కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ట్రేడర్లు భయాందోళనలకు గురవుతున్నారు. రష్యా నుంచి డీజిల్ ఎగుమతులు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, పశ్చిమాసియాలో నెలకొన్న ప్రమాద తీవ్రతను అది భర్తీ చేయలేకపోవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడనుంది. దేశీయ అవసరాల్లో అధిక శాతం ముడిచమురును దిగుమతి చేసుకునే భారత్‌కు, ధరలు పెరిగితే దిగుమతి బిల్లు భారీగా పెరుగుతుంది. ఇది వాణిజ్య లోటును పెంచి, రూపాయి విలువపై ఒత్తిడికి దారితీస్తుంది. మరోవైపు, చమురు మార్కెటింగ్ కంపెనీలపై భారం పడటంతో పాటు, రవాణా, ఉత్పాదక వ్యయాలు పెరిగి ద్రవ్యోల్బణం మరింత ఎగబాకే ప్రమాదం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారితేనేగానీ చమురు ధరలు దిగివచ్చే అవకాశం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### భారత్‌తో సంబంధాలు
## మళ్లీ గాడిన పడుతున్నాయి

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్‌కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నాయని కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అన్నారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలలో చోటుచేసుకుంటున్న ఈ మార్పును ఆమె ఒక "ఆహ్వానించదగ్గ పరిణామం"గా అభివర్ణించారు. వాణిజ్యం, పర్యాటకం, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉన్నాయని ఆనంద్ తెలిపారు. రాబోయే దశాబ్దంలో అమెరికాయేతర దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద శక్తిగా ఉన్న భారత్ తమకు ఎంతో ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు. నిజ్జర్ హత్య ఉదంతంపై మాట్లాడుతూ.. కెనడా గడ్డపై ఒక కెనడా పౌరుడి హత్యకు సంబంధించిన కేసులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, దేశీయ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వంతో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ఇందులో భాగంగానే 'బిష్ణోయ్ గ్యాంగ్'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించామని వెల్లడించారు. కెనడాలో నిరసనల సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు, ఇందిరా గాంధీ హత్యను ప్రస్తావించడం వంటి ఘటనలపై అడిగిన ప్రశ్నకు.. కెనడాలో భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజా భద్రతకు మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఈ అంశాన్ని దేశ ప్రజా భద్రత, న్యాయశాఖ మంత్రులు పర్యవేక్షిస్తున్నారని, తన దృష్టి అంతా విదేశీ సంబంధాలపైనే ఉందని ఆమె వివరించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన సంబంధానికి ఎంతో విలువ ఇస్తారని అనితా ఆనంద్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కెనడా పర్యటనకు రానున్న ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను బలోపేతం చేశామని, ఇరు దేశాల నేతలు క్రమం తప్పకుండా సమావేశమవుతూ సంబంధాలను మెరుగుపరుస్తున్నారని గుర్తుచేశారు.

## రైళ్లు ఆపలేదు: సుప్రీంకు ఢిల్లీ మెట్రో వెల్లడి

ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నిరసనల నేపథ్యంలో అక్టోబర్ 10న రైళ్ల సేవలను రద్దు చేయలేదని, ఎలాంటి సేవల్లో ఎలాంటి కోత విధించలేదని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) స్పష్టం చేసింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేసినప్పటికీ, మెట్రో కార్యకలాపాల పరిమాణంలో ఎలాంటి తగ్గింపు లేదని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వివరించింది. ఎన్డీటీవీకి లభించిన ఈ రిప్లై కాపీ ప్రకారం, అక్టోబర్ 10న స్టాండర్డ్ శనివారం షెడ్యూల్ ప్రకారమే 271 రైళ్లను సేవల్లోకి ప్రవేశపెట్టామని డీఎంఆర్సీ తెలిపింది. నెట్‌వర్క్ అంతటా పూర్తిస్థాయిలో 4,157 ట్రిప్పులు నడిపామని పేర్కొంది. మొత్తం 303 స్టేషన్లకు గాను, కేవలం 57 స్టేషన్లలో మాత్రమే ప్రయాణికుల ప్రవేశ, నిష్క్రమణలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వివరించింది. అంటే, 85 శాతం నెట్‌వర్క్ యథావిధిగా పనిచేసిందని స్పష్టం చేసింది. పరిమిత స్టేషన్లలోనే ఆంక్షలు విధించామని, ప్రయాణికుల అసౌకర్యాన్ని తగ్గించేందుకు మూసివేసిన స్టేషన్ల సమీపంలో ఇతర స్టేషన్లు తెరిచే ఉన్నాయని డీఎంఆర్సీ ఛైర్‌పర్సన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 45 ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లలో 14 స్టేషన్లలో సేవలు నిరంతరాయంగా కొనసాగాయని తెలిపారు. కోర్టు జోక్యం తర్వాత ప్రభావిత స్టేషన్ల సంఖ్యను పునఃసమీక్షించి తగ్గించినట్లు కూడా పేర్కొన్నారు. అక్టోబర్ 10న కేవలం 32 లక్షల మంది మాత్రమే మెట్రోలో ప్రయాణించారని, సాధారణంగా ప్రభుత్వ సెలవుదినమైన రెండో శనివారం నాడు ప్రయాణికుల సంఖ్య దాదాపు 58 లక్షలుగా ఉంటుందని డీఎంఆర్సీ తెలిపింది. నిరసనల కారణంగానే చాలా మంది ప్రయాణాలు మానుకున్నారని, అందుకే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని అభిప్రాయపడింది.

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధ్రువీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పాటించకపోతే సంస్థతో పాటు ఉద్యోగులు కూడా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఫ్రాన్స్ తన అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఎయిర్ ఫ్రాన్స్ నిర్ణయం ఫ్రాన్స్‌లో న్యాయపరమైన చిక్కులకు దారితీసే అవకాశం ఉంది. జాతీయత లేదా మతం ఆధారంగా వివక్ష చూపడాన్ని ఫ్రెంచ్ ఉపాధి చట్టాలు నిషేధిస్తున్నాయి. ఇది ఆ దేశ చట్టాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేశ భద్రత దృష్ట్యా తన గగనతలాన్ని నియంత్రించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పటికీ, ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల విమానయాన సంస్థలు తమ సొంత దేశాల్లో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ నిబంధనల వల్ల విమానయాన సంస్థల సిబ్బంది షెడ్యూలింగ్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

## ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?..
### ట్రంప్, నెతన్యాహు మధ్య రహస్య చర్చలు!

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే కీలక పరిణామం ఒకటి తెరపైకి వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్య చేపట్టే అంశంపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మధ్య గత వారం ఈ కీలక సంభాషణలు జరిగినట్లు పలువురు అధికారులు తెలిపారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలను కమ్ముకునేలా చేస్తోంది. ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ తన అణు కార్యక్రమానికి సంబంధించిన కొన్ని భాగాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉందని నెతన్యాహు, ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పికాక్స్ మౌంటెన్' వంటి ప్రదేశాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక చర్యను పునఃప్రారంభించేందుకు నెతన్యాహు తీవ్ర ఆసక్తి చూపారని, దీనిపై ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ట్రంప్ ఆయనకు చెప్పినట్లు ఒక అమెరికా అధికారి పేర్కొన్నారు. అయితే, ట్రంప్ దీనిపై ఎటువంటి కచ్చితమైన హామీ ఇవ్వలేదని సమాచారం. మొదట ఈ ఆలోచనకు ట్రంప్ సానుకూలంగా ఉన్నప్పటికీ, తన సలహాదారులతో సంప్రదించిన తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సెంట్రల్ కమాండ్ నాయకత్వం సైనిక చర్యకు మొగ్గు చూపగా, ట్రంప్ సలహాదారుల్లో మెజారిటీ సభ్యులు మాత్రం ప్రస్తుతానికి ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని కొనసాగించడమే మేలని సూచించినట్లు సమాచారం. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేయబోమని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడానికి ముందే ఈ చర్చలు జరగడం గమనార్హం. ఈ పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 27న, అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ఇరాన్‌పై భారీ సైనిక చర్యకు దిగితే, అది రెండు దేశాల ఎన్నికల్లోనూ ప్రధాన ప్రచారాంశంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల వైఖరిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే, ఈ వార్తలను వైట్‌హౌస్ ఖండించింది. మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై ఎటువంటి దాడి ఉండదని అధ్యక్షుడు స్పష్టం చేశారని, యుద్ధాన్ని పునరుద్ధరించే అంశంపై నేతలు చర్చించలేదని పేర్కొంది. మరోవైపు, నెతన్యాహు కార్యాలయం స్పందిస్తూ.. ట్రంప్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ధ్రువీకరించింది.

## భారత్‌పై ఐఎస్ఐ 'డిజిటల్ జిహాద్'.. నిరసనలే లక్ష్యంగా 5వేల ఫేక్ అకౌంట్లతో కుట్ర!

భారత్‌పై పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ 'డిజిటల్ జిహాద్'ను తీవ్రతరం చేసింది. దేశంలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిరసనలను ఆసరాగా చేసుకుని, హింసను ప్రేరేపించేందుకు భారీ కుట్రకు తెరలేపింది. గత రెండు వారాల్లోనే సుమారు 5,000కు పైగా నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి, భారత భద్రతా బలగాలు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విష ప్రచారాన్ని ఉధృతం చేసినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఫేక్ ఖాతాల ప్రధాన లక్ష్యం నిరసనల్లో పాల్గొంటున్న యువతను రెచ్చగొట్టడమేనని 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) అధికారి ఒకరు తెలిపారు. పోలీసుల లాఠీఛార్జ్, కాల్పులు, భాష్పవాయువు ప్రయోగం వంటి అబద్ధాలతో కూడిన పోస్టులను సృష్టించి సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారు. దీని ద్వారా యువతను హింస వైపు మళ్లించి, దేశవ్యాప్తంగా అశాంతిని సృష్టించాలన్నది ఐఎస్ఐ వ్యూహంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. ఈసారి ఐఎస్ఐ తన కార్యకలాపాల శైలిని మార్చిందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. గతంలో రావల్పిండి, ఇస్లామాబాద్ వంటి ప్రధాన కేంద్రాల నుంచి ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసేవారు. దీంతో వారిని గుర్తించడం సులభమయ్యేది. కానీ, ఇప్పుడు భింబర్, రావల్‌కోట్, సియాల్‌కోట్, పెషావర్ వంటి అనేక చిన్న పట్టణాలకు తమ కార్యకలాపాలను విస్తరించారు. స్థానికులను నియమించుకుని వారి ద్వారా సోషల్ మీడియా ఖాతాలు తెరిపించి, తాము అందించిన సమాచారాన్ని పోస్ట్ చేయిస్తున్నారు. ఈ పోస్టుల వ్యాప్తిని పెంచేందుకు విదేశాల్లోని యూజర్లను కూడా ట్యాగ్ చేయాలని సూచిస్తున్నారు. ఈ ఫేక్ న్యూస్ ఎంత ప్రమాదకరంగా ఉందంటే, ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కూడా తప్పుడు ప్రచారం చేశారు. ఢిల్లీలో పోలీసుల కాల్పుల్లో రాహుల్ గాయపడినట్లు కొన్ని ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఈ వార్తతో కాంగ్రెస్ మద్దతుదారులను రెచ్చగొట్టి, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు సృష్టించేందుకు ప్రయత్నించారు.

## సంపాదకీయం

### స్థానిక ఎన్నికల వేళ కూటమిలో కుదుపులు

# చంద్రబాబు ముందున్న సవాళ్లు

ఊహించినట్లుగానే సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిజర్వేషన్ల వాదనను తిరస్కరించింది. హైకోర్టు చెప్పిన విధంగానే ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల లోపు మొదలుపెట్టమని చెప్పింది. ఎన్నికల సంఘం అందుకు తమ సంసిద్ధతను వ్యక్తపరిచింది. 'సర్' ప్రక్రియ ముగిసిన తరువాతనే ఎన్నికలు జరిపించాలని వైసీపీ చేసిన వాదనకు పస లేకపోయింది. "ఎన్నికలు నిర్వహించే వారికి లేని సమస్య మీకెందుకు?" అని ప్రశ్నించింది. జగన్ మోహన్ రెడ్డి ఈ మధ్యనే ఒకానొక సందర్భంలో 'సర్' ప్రక్రియను విమర్శించాడు. ఇప్పుడు 'సర్' ప్రక్రియ పూర్తి అయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు ఆపాలి అని కోర్టుకెళ్లాడు. తాను స్వయంగా నిన్న చెప్పిన మాట ఈరోజు తానే ఒప్పుకోకపోవటం జగన్‌కు అలవాటే కాబట్టి, ఇందులో కొత్త విషయం ఏమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు వచ్చేశాయి. అయితే జగన్ మోహన్ రెడ్డి సర్వ స్వతంత్రుడు కాబట్టి, ఇప్పటికే చాలా చోట్ల అభ్యర్థులను నిర్ణయించటం అయిపోయింది. మిగిలిన స్థానాలలో కూడా అభ్యర్థుల పట్ల జగన్ నిర్ణయించుకునే ఉన్నాడు. కానీ కూటమికి మాత్రం సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి రావటం కష్టంగా ఉంది. 2024 ఎన్నికల ఫలితాల ఖ్యాతి ఎవరిది అనే విషయం చుట్టూనే పొత్తుల వ్యవహారం నడుస్తున్నది. శాసనసభ ఎన్నికలలో వంద శాతం స్ట్రైక్ రేట్ అనేది జనసేన దూకుడును పెంచింది. టీడీపీ గెలవటానికి ప్రధాన కారణం, అప్పటివరకు శాసనసభ్యుడు కూడా కాని, రెండు స్థానాలలో ఓటమిని ఎదుర్కొన్న పవన్ కళ్యాణే అని జనసేన బలమైన వాదనతో ముందుకొస్తున్నది. ఈ వాదన జనసేన ఈరోజు కొత్తగా మొదలుపెట్టలేదు. కూటమి పార్టీలు జయకేతనం ఎగురవేసిన రోజు నుండి గెలుపుకు టీడీపీ కంటే పవనే ఎక్కువ ఆకర్షణగా నిలిచారు అనే ప్రచారం ముమ్మరంగా సాగుతున్నా, టీడీపీ దానిని అడ్డుకునే ప్రయత్నం ఏమాత్రం చేయలేదు. దాని ప్రభావం ఇప్పుడు టీడీపీ పైన బలంగా కనిపిస్తున్నది. ఇక్కడ టీడీపీ ఇచ్చే పార్టీగా, జనసేన తీసుకునే పార్టీగా పరిగణించబడటం తెలుగుదేశం పార్టీకి ఇబ్బంది కలిగిస్తున్నది. తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుంది అనే విషయం కంటే, టీడీపీ భవిష్యత్తు ప్రణాళిక పట్ల టీడీపీ శ్రేణులకు ఒక ఆందోళన కలుగుతున్నది. ప్రభుత్వం మీద పవన్ కళ్యాణ్ పెత్తందారీతనం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. రాజ్యాంగం ప్రకారం క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి, సహచర మంత్రులు అందరూ సమానమే. అయితే రాజ్యాంగం ఏం చెప్పినా ముఖ్యమంత్రి కెప్టెన్ మాత్రమే కాక అధినాయకుడిగానే పరిగణించబడతారు. అలాంటి కోణంలో గమనిస్తే ముఖ్యమంత్రిని మినహాయిస్తే క్యాబినెట్ మంత్రులందరూ సమానమే. కానీ పవన్ కళ్యాణ్ విషయానికి వచ్చేటప్పటికి ఉప ముఖ్యమంత్రికి, ముఖ్యమంత్రితోనే ఎక్కువ సమానత్వం కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రులు రావటం కొత్తేమీ కాదు. కానీ 2024 తరువాత అటువంటి పరిస్థితి మారిపోయింది. క్యాబినెట్ మంత్రులు పవన్ కళ్యాణ్ వస్తున్నప్పుడు చంద్రబాబును ఎంతగా సాదరంగా ఆహ్వానిస్తారో, పవన్ కళ్యాణ్‌కు కూడా అదే రకం స్వాగత సన్నాహాలు చేయవలసి వస్తున్నది. పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి రాకముందు నుండే టీడీపీలో సీనియర్ నాయకులుగా కొనసాగుతున్న పయ్యావుల కేశవ్ లాంటి వారు కూడా పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వటమే కాక, ఇస్తున్నట్లు రుజువు చేసుకోవలసి వస్తున్నది. ఇది అప్రకటితంగా కూడా లేదు. ప్రభుత్వ కార్యాలయాలలో పవన్ కళ్యాణ్ ఫోటో వివాదం వచ్చినప్పుడు, ఉప ముఖ్యమంత్రి ఫోటో కూడా పెట్టాలని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. కూటమిలో ఉన్న మూడు పార్టీలు సమానం అని చెప్పాలనుకుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఫోటో కూడా పెట్టాలి. కానీ అటువంటిదేమీ కనిపించలేదు. ఎంతకాలం ఈ పరిస్థితి కొనసాగించగలుగుతారు అంటే ఎవరూ చెప్పలేరు. కూటమి పార్టీల మధ్య సఖ్యత అవసరం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంబంధించినది. వారి అభివృద్ధి కోసం మూడు పార్టీలు కొన్ని మినహాయింపులతో కూడిన అవగాహనను కలిగి ఉండటం అవసరం. కానీ కూటమిలో అటువంటి అవగాహన చంద్రబాబు నాయుడు బాధ్యతగా మారిపోయింది. ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అనేది 'టూ ప్లస్ వన్' (2+1) ఫార్ములా. జనసేన, బీజేపీ ఒక జట్టు అయితే, టీడీపీ ఒక జట్టు. జనసేన ఒక్కదానితోనే చంద్రబాబు చెలిమి చేస్తానంటే కుదరదు. జనసేనతో చెలిమిని కాపాడుకోవాలంటే బీజేపీని కూడా సంతృప్తి పరచాలి. అందుకని రెండు పార్టీలను సంతృప్తి పరచటం అనేది చంద్రబాబు నాయుడు భుజస్కంధాల పైన ఉన్న గురుతరమైన బాధ్యత. మోదీని సంతృప్తి పరచటానికి 'డబుల్ ఇంజన్ సర్కార్'ను ప్రమోట్ చేయాలి. పవన్ కళ్యాణ్‌ను సంతృప్తి పరచటానికి తన టీడీపీ సహచర మంత్రివర్గ సభ్యులందరితో పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకమైన రాచమర్యాదలు జరిపించాలి. మోదీని సంతృప్తి పరచటానికి ఎప్పుడో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని ఇప్పుడు విమర్శించాలి. కానీ ఎమర్జెన్సీ విధించిన ఇందిరా గాంధీ పార్టీలో ఎమర్జెన్సీ తరువాతనే చేరి చంద్రబాబు శాసనసభ్యుడు అయిన విషయం మోదీ వాళ్లు మరచిపోరు. వాళ్ల సోషల్ మీడియాలో అప్పుడో ఇప్పుడో గుచ్చుతూనే ఉంటారు. తొంభైల్లో చంద్రబాబు 1.0 అయితే, 2024 లో చంద్రబాబు 2.0 అని బాబు చెబుతారు. అది వాస్తవమే కానీ, అందులో ఉన్న '2' మాత్రం పవన్ కళ్యాణ్, మోదీ అనిపించేలా ఉంటున్నది చంద్రబాబు వ్యవహారశైలి. ప్రభుత్వాన్ని నడపటం కంటే కూటమి సఖ్యతను కాపాడటం అనేది ప్రాధాన్యతను సంతరించుకున్నది. వీటితో పాటు ఒక విషయం గమనిస్తే జనసేన అధినాయకుడు జగన్ మోహన్ రెడ్డి ప్రస్తావన చేయడు. 2019 - 2024 మధ్య కాలంలో జరిగిన విషయాల గురించి ఎన్నికలు అయ్యేంతవరకే ప్రస్తావించాలి కానీ, ఇప్పుడు అనవసరం అనే సూత్రానికి కట్టుబడి ఉన్నట్లుగా కనిపిస్తున్నది. దానికి రాజకీయ నీతిశాస్త్రం కారణమా, బీజేపీ పంథానా అనేది ప్రధానమైన ప్రశ్న. మొదటి కారణం అయితే ఖచ్చితంగా అభినందించాలి. రెండవ కారణమే అయితే చంద్రబాబు ఆలోచించుకోవాలి. అదే నీతి సూత్రాన్ని రేపు స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా పాటించాలి పవన్ కళ్యాణ్. కూటమి ప్రభుత్వ విజయాలు, అపజయాలు, లోసుగులు అన్నీ ప్రజలకు వివరించి చెప్పి ఓట్లు అడగాలి జనసేన. చంద్రబాబు జగన్ మోహన్ రెడ్డిని ఎండగట్టే బాధ్యత తీసుకుంటే, పవన్ కళ్యాణ్ తనకు ఓట్లు వేయమని సంస్కారయుతంగా ఓటర్లకు విజ్ఞప్తి చేస్తాడు. విపక్షాన్ని దుయ్యబట్టటానికి చంద్రబాబు, లోకేష్‌లకు కూటమి గుత్తగా కాంట్రాక్టు ఇచ్చినట్లుగా ఉన్నది. భువనేశ్వరి గురించి అవాకులు, చెవాకులు పేలిన వారిని అరెస్ట్ చేయటానికి పక్కదారులు అన్వేషిస్తారు. కానీ పవన్ కళ్యాణ్ కుటుంబం గురించి మాట్లాడితే ప్రమాదకరమైన నిర్ణయం తీసుకున్నారు. అది భవిష్యత్తులో ఎంత ప్రభావం చూపిస్తుందో బాబుకు తెలియక మాత్రం కాదు. జగన్ మోహన్ రెడ్డి పరిపాలకుడు కాకపోవటం వలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు ముఖ్యమంత్రిత్వం అనేది తప్పనిసరి అయిన మాట వాస్తవం. కానీ దానికి కావలసింది తొంభైల్లో ఉన్న చంద్రబాబు; ఇంత బలహీనంగా వ్యవహరించే చంద్రబాబు కాదు. కూటమిలో కనీస అవగాహన లేదు. శాసనసభ ఎన్నికలకు ముందు టీడీపీ నుండి బీజేపీలోకి వెళ్లిన అభ్యర్థులకు ప్రచారం చేసిన చంద్రబాబు, ఇప్పుడు టీడీపీ నుండి జనసేనలోకి వెళ్లిన అభ్యర్థులకు ప్రచారం చేస్తారు. కూటమి ధర్మంలో టీడీపీలో ఉన్న వాళ్లను జనసేన తీసుకుని, జనసేనలో ఉన్నవాళ్లను మరో పార్టీ తీసుకోవటం అనేది ప్రజలకు ఎటువంటి సంకేతాన్ని ఇస్తుందో చూడాలి. కూటమిని కాపాడటానికి కీలకమైన స్థానాలను వదులుకోవటానికి కూడా సిద్ధపడ్డారు చంద్రబాబు. సర్దుబాట్లు తప్పవు, కానీ పరిమితిని మించిన సర్దుబాట్లు చేస్తున్నట్లుగా ఉన్నది. సర్దుబాట్లకు సంబంధించిన చర్చలు టీడీపీ కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేశాయి అనేది వాస్తవం. 'స్నేహపూర్వక పోటీ' అనే బెదిరింపు మాటలు చర్చలను పక్కదారి పట్టిస్తాయి అనే కనీసపు అవగాహన లేని రాజకీయ పార్టీల మధ్య సయోధ్య ఎలా ఉంటుందో ఆంధ్రప్రదేశ్‌లో కూటమిని చూస్తే అర్థమవుతుంది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### అక్టోబర్ 15

OCTOBER 15

* ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం
* 1542 : మొఘల్ చక్రవర్తి అక్బర్ సింధు ప్రాంతంలోని అమర్‌కోట్‌లో జన్మించాడు (మ.1605).
* 1908 : ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త జాన్ కెన్నెత్ గాల్‌బ్రెత్ జననం (మ.2006).
* 1918 : భారతీయ ఆధ్యాత్మిక గురువు షిర్డీ సాయిబాబా పరమపదించాడు (జ.1838).
* 1918 : సారస్వత నికేతనం తెలుగు గ్రంథాలయం ప్రకాశం జిల్లా వేటపాలెం లో ప్రారంభం.
* 1920 : ప్రముఖ సంఘ సేవకుడు, పద్మభూషణ అవార్డు గ్రహీత భూపతిరాజు విస్సంరాజు జననం (మ.2002).
* 1929 : ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు వెంపటి చినసత్యం జననం (మ.2012).



ఎ. పి. జె. అబ్దుల్ కలామ్

* 1931 : భారత దేశపు మాజీ రాష్ట్రపతి ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ జననం (మ.2015). (చిత్రంలో)
* 1937 : స్వాతంత్ర్య సమరయోధుడు, కొచ్చిన్ సంస్థానం దీవాన్ నెమిలి పట్టాభి రామారావు మరణం (జ.1862).
* 1964 : చైనాలో అత్యంత ధనిక వ్యాపారవేత్త, ఆలీబాబా వ్యాపార సంస్థల అధినేత జాక్ మా జననం.

## జనసేనలో చేరిన వంగవీటి రాధా..
### విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?

- కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కళ్యాణ్
- విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
- జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
- విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
- కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు



మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

## ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం.. మాజీ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు ఈడీ నోటీసులు

- విచారణకు హాజరు కావాలని రజత్ భార్గవకు ఈడీ ఆదేశం
- వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ



ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో విచారణ మరింత వేగవంతమైంది. ఈ కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద నమోదైన కేసులో భాగంగా, హైదరాబాద్‌లోని తమ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రజత్ భార్గవ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో రూపొందించిన నూతన మద్యం విధానం, మద్యం బ్రాండ్ల ఆమోదం, కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రజత్ భార్గవను పలుమార్లు విచారించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. సిట్ విచారణలో భాగంగా, నాటి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే మద్యం విధానంలో అక్రమాలు జరిగాయని, బేస్ ధరల పెంపును తాను వ్యతిరేకించినా పట్టించుకోలేదని భార్గవ వాంగ్మూలం ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. సిట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ, ఇప్పుడు ఆర్థిక లావాదేవీల మూలాలను శోధిస్తోంది. భార్గవను ప్రశ్నించడం ద్వారా ఈ కుంభకోణంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

# కూటమి పాలనలో కొలువుల జాతర.. ఇచ్చిన మాటకు కట్టుబడ్డాం: ఎస్వీఎస్ఎన్ వర్మ

- **కూటమి ప్రభుత్వంలో కొలువుల జాతర నడుస్తోందన్న టీడీపీ నేత వర్మ**
- **150 రోజుల్లోనే 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ పూర్తి చేశామని వెల్లడి**
- **గెస్ట్ లెక్చరర్లు, పోలీస్ ట్రైనీల పారితోషికాలు, స్టైపెండ్లు భారీగా పెంపు**
- **24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా లోకేశ్ కృషి చేస్తున్నారని వ్యాఖ్య**
- **గత వైసీపీ పాలనలో నిరుద్యోగుల భవిష్యత్తు నాశనమైందని విమర్శ**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొలువుల జాతర కొనసాగుతోందని, ఇచ్చిన మాటకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని టీడీపీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. సీబీఎన్ అంటే డీఎస్సీ అని, డీఎస్సీ అంటేనే సీబీఎన్ అని, మాట ఇస్తే నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ మార్క్ పాలన అని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాష్ట్ర విద్యా వ్యవస్థ ప్రక్షాళన జరుగుతోందని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగులు నరకం చూశారని వర్మ తీవ్రంగా విమర్శించారు. ఒక్క జాబ్ క్యాలెండర్ గానీ, డీఎస్సీ గానీ ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ



ఉద్యోగాలను అత్యంత పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా భర్తీ చేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపిందని ఆయన పేర్కొన్నారు. గతంలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలను పునరుద్ధరించామని, 90 మంది ఎస్టీ యువతకు కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు, 700 కోయ భారతి టీచర్ పోస్టులను విజయవంతంగా భర్తీ చేశామని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల పారితోషికాన్ని ఒక పీరియడ్‌కు రూ. 150 నుంచి రూ. 375కు పెంచామని, దీనివల్ల వారు నెలకు గరిష్ఠంగా రూ. 27,000 అందుకునే అవకాశం కలిగిందని వర్మ తెలిపారు. అలాగే, పోలీస్ కానిస్టేబుల్ ట్రైనీలకు నెలకు ఇచ్చే స్టైపెండ్‌ను రూ. 4,500 నుంచి రూ. 12,000కు పెంచి, 5,757 మంది యువతకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ యువత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పునరుద్ఘాటించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు దానికి మించి 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని వర్మ ప్రశంసించారు. గత 26 నెలల్లోనే పారిశ్రామిక అనుకూల విధానాలతో గూగుల్, గ్రీన్‌కో వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి సుమారు రూ. 29 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించారని గుర్తుచేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోనసీమ అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతానికి అనువైన పరిశ్రమలను నెలకొల్పుతున్నారని అన్నారు. యువత ఉపాధి కోసం లోకేశ్ విదేశీ పర్యటనలు చేస్తుంటే, ప్రతిపక్షాలు కనీస జ్ఞానం లేకుండా విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తూ విద్యను ప్రోత్సహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంచి 'నో అడ్మిషన్స్' బోర్డులు పెట్టే స్థాయికి తీసుకొచ్చామని వర్మ వివరించారు. ప్రజలు మరో 15 ఏళ్లు కూటమి పాలనే కోరుకుంటున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వివేకా హత్య కేసు.. ఈడీ విచారణకు హాజరైన వైఎస్ అవినాశ్ రెడ్డి

- **మనీలాండరింగ్ కోణంలో కొనసాగుతున్న ఈడీ దర్యాప్తు**
- **హత్యకు సంబంధించి రూ.40 కోట్ల డీల్‌పై ప్రధాన దృష్టి**
- **హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో కొనసాగుతున్న విచారణ**

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఈరోజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో ఆయన



అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీల కోణంలో ఈడీ అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. ఈ హత్య వెనుక జరిగిన ఆర్థిక లావాదేవీలపై... ముఖ్యంగా రూ.40 కోట్ల డీల్ జరిగిందన్న ఆరోపణలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన ఆర్థిక లావాదేవీలను ఈడీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో భాగంగా ఈడీ ఇప్పటికే పలువురు నిందితులను, అప్రూవర్లుగా మారిన వారిని కూడా విచారించింది. 2019 నుంచి జరిగిన బ్యాంకు లావాదేవీలు, నిధుల బదిలీలపై లోతుగా ఆరా తీస్తోంది. గతంలో హైదరాబాద్, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలతో పాటు లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా విచారణతో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఎర్రబస్సే రాదన్నారు.. అదే విమానాశ్రయంలో దిగారు: జగన్‌పై ఎంపీ కలిశెట్టి విమర్శలు

శ్రీకాకుళం: ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్ ఎలా వస్తుందని మాజీ ముఖ్యమంత్రి జగన్ గతంలో ఎద్దేవా చేశారని.. ఇప్పుడు అదే విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. భోగాపురానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విమానాశ్రయాన్ని తెచ్చి చూపించారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో



ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజలకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో చేయలేనిది.. కూటమి రెండేళ్లలో చేసి చూపించిందన్నారు. జగన్ ఉత్తరాంధ్ర అంతా తిరిగి అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయని.. కూటమి అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం.. అధికారులకు తీవ్ర హెచ్చరిక

- **పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదని అధికారులపై అసహనం**
- **నిర్లక్ష్యం చేస్తే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్కో సీఎండీని సస్పెండ్ చేస్తానని హెచ్చరిక**
- **రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై యూకే మేయర్ల బృందంతో సీఎం చర్చలు**
- **ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ఆహ్వానం**

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

**యూకే మేయర్లతో సీఎం భేటీ**

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్,



పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకేఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకేఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

# తితిదే కల్తీ నెయ్యి కేసు..
## రూ.130 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

అమరావతి: తితిదే కల్తీ నెయ్యి కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కీలక నిర్ణయం తీసుకుంది. భోలేబాబా, శ్రీవైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్ సంస్థలకు చెందిన దాదాపు రూ.130 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. సంస్థల ప్రమోటర్లు విపిన్ జైన్, కైలాశ్ చంద్ర మంగ్లా, వారి కుటుంబ సభ్యుల ఆస్తులపైనా పీఎంఎల్ఏ చట్టం కింద ఈమేరకు చర్యలు తీసుకుంది. తితిదేకు భోలేబాబా రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ కేసులో గతంలో ఆరు రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. రూ.2.7 కోట్ల నగదును



సీజ్, బ్యాంకు నిల్వలను ఫ్రీజ్ చేసింది. ఇప్పటికే విపిన్ జైన్, కైలాశ్ చంద్ర మంగ్లాలను అరెస్టు చేసింది.

# కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు:
## రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- **వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు చేశారని విమర్శ**
- **సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం జరిగిందన్న కేటీఆర్**
- **సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన'



సభలో ఆయన ప్రసంగించారు. కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# కూటమిగానే పోటీ చేస్తాం.. జనసేన కీలక ప్రకటన

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం ముగిసింది. భేటీ అనంతరం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగానే పోటీ చేస్తామని తెలిపారు. ఇరు పార్టీల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. "మా చర్చల్లో ఏకాభిప్రాయం కుదిరింది. స్థానిక పరిస్థితుల మేరకు ఎవరు పోటీ చేయాలో నిర్ణయం తీసుకుంటాం. ఇన్ని సీట్లలో పోటీ చేయాలని లెక్కలేమీ వేసుకోలేదు. పోటీ చేసే స్థానాలపై రెండు రోజుల్లో ప్రకటన చేస్తాం. మరో భేటీలో సీట్లు ఖాయం చేసుకుంటాం. కూటమి



తరఫున అభ్యర్థుల జాబితా ప్రకటిస్తాం" అని తెలిపారు.

# సినిమా చూస్తూ డ్రైవింగ్.. ఆటో డ్రైవర్‌పై వీసీ సజ్జనార్ సీరియస్

- **డ్రైవింగ్ చేస్తూ సినిమా చూస్తున్న ఆటో డ్రైవర్ వీడియోపై వీసీ సజ్జనార్ స్పందన**
- **ఇది క్షమించరాని నేరం, నడుస్తున్న మృత్యుశకటం అంటూ తీవ్ర ఆగ్రహం**
- **ప్రమాదకర డ్రైవింగ్ కింద భారీ జరిమానా, లైసెన్స్ రద్దు తప్పదని హెచ్చరిక**
- **ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, డ్రైవర్‌ను ప్రశ్నించాలని సూచన**
- **వీడియోలోని ఆటోను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం**

డ్రైవింగ్ చేస్తూ సినిమా చూడటం, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకోవడం వంటి నిర్లక్ష్యపూరిత చర్యలపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఓ ఆటో డ్రైవర్ ఒకేసారి రెండు ఫోన్లు వాడుతూ, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సినిమా చూస్తూ వాహనం నడుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ డ్రైవర్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక నెటిజన్ పంపిన ఈ వీడియోపై సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. "రెండు కళ్లకు ఎదురుగా రెండు ఫోన్లు, ఒక దాంట్లో నావిగేషన్, మరో దాంట్లో సినిమా, చెవులకు పెద్ద హెడ్‌ఫోన్లు. ఇది చూడటానికి గేమింగ్ విన్యాసంలా ఉన్నా, ప్రయాణికుల పాలిట నడుస్తున్న మృత్యుశకటం" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. డ్రైవింగ్ సమయంలో క్షణకాలం దృష్టి మళ్లినా ఘోర ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఇలా సినిమా చూస్తూ వాహనం నడపడం కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదని, క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఇది 'ప్రమాదకర డ్రైవింగ్' కిందకు వస్తుందని, దీనికి భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వినోదం కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ఆటోను థియేటర్‌గా మార్చి



జీవితాలకు 'ది ఎండ్' కార్డు వేయొద్దని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. డ్రైవర్ ఫోన్ చూస్తున్నా, హెడ్‌ఫోన్లు పెట్టుకున్నా మౌనంగా ఉండవద్దని, వెంటనే ప్రశ్నించి వారించాలని కోరారు. వారు వినని పక్షంలో డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, వీడియోలో కనిపించిన టీజీ15యూ2657 నంబర్ గల ఆటో డ్రైవర్‌ను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించినట్లు సజ్జనార్ వెల్లడించారు.

# ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన.. కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు

- **సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం**
- **నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు**
- **సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం**
- **అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల**
- **స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు**



తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రా దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# దేశాన్ని తప్పుదోవ పట్టించొద్దు

## : రాహుల్‌కు భాజపా హితవు



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేస్తున్న సీజేపీ కార్యకర్తలకు రాహుల్ గాంధీ మద్దతుగా నిలవడాన్ని భాజపా తీవ్రంగా తప్పుపట్టింది. దేశాన్ని తప్పుదోవ పట్టించవద్దని ఆయనకు హితవు పలికింది. నిరసన తెలిపేందుకే రాజ్యాంగం హక్కు కల్పించిందని, చట్టాన్ని ఉల్లంఘించడానికి కాదని పేర్కొంది. "దేశాన్ని తప్పుదోవ పట్టించొద్దు. నిరసన తెలిపేందుకే రాజ్యాంగం హక్కు కల్పించింది. అంతేకానీ, చట్టాన్ని ఉల్లంఘించడానికి కాదు. నిబంధనల ప్రకారమే జంతర్ మంతర్‌పై నిర్ణయం తీసుకున్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదు. దశాబ్దాల పాటు మీ పార్టీ, కుటుంబం.. ఆర్టికల్ 370కు మద్దతు తెలుపుతూ వచ్చింది. కానీ, ప్రధాని మోదీ దానిని రద్దు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. అధికారం కోసం బహిరంగ ప్రదేశాలను అల్లర్లకు కేంద్రాలుగా మార్చలేరు. దేశం ఎప్పుడూ చట్టం వైపే నిలుస్తుంది. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు" అని భాజపా జాతీయ మీడియా కన్వీనర్ ఆశీష్ ఉషా అగర్వాల్ దుయ్యబట్టారు.

# ఎకరా రూ.15 లక్షలకు కొని.. నెలల్లోనే రూ.3 కోట్లకు విక్రయం..!



కొన్ని నెలల కిందట ఎకరం రూ.15 లక్షల పలికిన భూమి ధర అకస్మాత్తుగా రూ.3 కోట్లకు ఓ క్రికెట్ అసోసియేషన్ కొనుగోలు చేసింది..! ఈ కళ్లు చెదిరే ల్యాండ్ డీల్ పంజాబ్‌లోని అమృత్‌సర్, బఠిండా ప్రాంతాల్లో జరిగింది. ఈ విషయం బయటకు పొక్కడంతో భూమి కొనుగోలు విషయంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ కొనుగోళ్లలో భాగమైన పంజాబ్ క్రికెట్ అసోషియేషన్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పంజాబ్ పోలీసుల్ని కోరింది. పంజాబ్‌లోని అమృత్‌సర్ సమీపంలోని ఓ గ్రామంలో ఎకరం భూమిని రియల్ఎస్టేట్ వ్యాపారులు రూ.15 లక్షలకు కొనుగోలు చేశారు. గతేడాది చివర్లలో ఈ లావాదేవీలు జరిగాయి. ఆ భూమిని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎకరం రూ.3కోట్ల చొప్పున పంజాబ్ క్రికెట్ అసోషియేషన్ కు విక్రయించారు. అంటే కేవలం నెలల వ్యవధిలోనే భూమి ధర అమాంతం 20 రెట్లు పెరిగినట్లు ఈ లెక్కల ద్వారా తెలుస్తోంది. మొత్తంగా అమృత్‌సర్, బఠిండా ప్రాంతం నుంచి పీసీఏ 77.99 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. వాస్తవ విలువ కంటే అనూహ్యస్థాయిలో ధరలు చెల్లించినట్లు పీసీఏపై ఆరోపణలు వచ్చాయి. దీంతో నిధుల దుర్వినియోగం, మోసం జరిగి ఉండొచ్చని ఈడీ అనుమానించింది. మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపించాలని పంజాబ్ పోలీసుల్ని కోరింది. ఇదిలాఉంటే.. పీసీఏ యాజమాన్యం భూమి కొనుగోలులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ రంజీల్లో ఆడిన మాజీ క్రికెటర్ రాకేశ్ హండా పంజాబ్ హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి పీసీఏ పాలకమండలి నుంచి తప్పనిసరి అనుమతులు పొందలేదని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని న్యాయస్థానం ఈ ఏడాది ఆగస్టులో ఈడీ, పీసీఏ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చింది. మంగళవారం జరిగిన విచారణలో భాగంగా తన దర్యాప్తులో గుర్తించిన అంశాలను న్యాయస్థానానికి ఈడీ సమర్పించింది.

# జర్మనీలో అగ్నిప్రమాదం.. ముగ్గురు భారతీయుల మృతి



జర్మనీలోని బాకూమ్ నగరంలో ఓ నివాస సముదాయంలో జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. మృతుల వయసు 25 నుంచి 27 మధ్య ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మంగళవారం ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది. చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. భారతీయులని ప్రాథమికంగా గుర్తించినప్పటికీ.. వారు ఏ రాష్ట్రాలకు చెందిన వారినే విషయం ఇంకా స్పష్టత రాలేదు. దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు.. ఈ ఘటన వెనుక మానవ ప్రమేయం, కుట్ర దాగుందనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రొమేనియాకు చెందిన ఓ అనుమానితుడిని అరెస్టు చేశారు. అతడు కూడా ఇదే భవనంలో నివసిస్తున్నట్లు గుర్తించారు. హత్య అని అనుమానించేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టినట్లు తెలుస్తోందని పోలీసులు పేర్కొన్నారు.



# పాకిస్థాన్ మళ్లీ 'హ్యాండ్ ఇచ్చింది'..!

ఒక చిన్న గెరిల్లా దళమైన హూతీలు సౌదీ అరేబియాపై వరుస దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. రియాద్‌కు నమ్మకంగా ఉన్నట్టు నటించే పాకిస్థాన్ మరోసారి ముఖం చాటేసింది. ఇన్ని దాడులు జరుగుతున్నా ఇస్లామాబాద్ ఉలుకుపలుకు లేకుండా ఉండటం గమనార్హం. ఆగస్టు 7న సౌదీ, పాకిస్థాన్, తుర్కియేలు 'మక్కా ఒప్పందం' పేరిట రక్షణ ఒడంబడికను కుదుర్చుకున్నాయి. తమలో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా మూడు దేశాలూ రంగంలోకి దిగుతాయని హెచ్చరించాయి. కానీ గెరిల్లాల దెబ్బకు సౌదీ విలవిలలాడుతోంది. అయినా పాక్ పట్టించుకోకపోవడం గమనార్హం.

**ఇరాన్‌తో భయం..**

పాకిస్థాన్‌కు యుద్ధంలో దిగాలనివున్నా ఇరాన్ భయం నిలువరిస్తోంది. ఇప్పటికే భారత్ ధాటికి పలు వైమానిక స్థావరాలను కోల్పోయింది. ఇరాన్‌తోనూ పాక్‌కు సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. మరోపక్క తాలిబాన్ల సర్కార్‌తో పోరు సాగిస్తోంది. యెమెన్‌లో ఎలాంటి సైనిక చర్యలో పాల్గొన్నా.. ఇరాన్ ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. ఇప్పటికే రెండు సరిహద్దు దేశాలతో ఉద్రిక్తతలు ఉన్నాయి. కొత్తగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు అంటే కష్టమే అని పాక్ పాలకులు భయపడుతున్నారు. అందుకనే ఈ ఉద్రిక్తతలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

**అంతర్గత పోరు..**

దేశంలో షియా వర్గాలపై జరుగుతున్న దాడులతో వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. హూతీలపై ఎటువంటి దాడులు చేపట్టినా స్వదేశంలో తీవ్ర నిరసనలు ఎదురుకావచ్చు. ఇప్పటికే ఉగ్రవాదంతో పాటు వేర్పాటువాదం, సరిహద్దు సమస్యలు ఎదుర్కొంటున్న పాక్‌కు ఇది మింగుడుపడని వ్యవహారమే. అందుకనే దూరంగా ఉంటున్నారు.

**1960ల నుంచి ఇదే మాట..**

1960ల నుంచి సౌదీని నమ్మించి మోసం చేయడం పాక్‌కు రివాజుగా మారింది. 1969లో దక్షిణ యెమెన్ దళాలు సౌదీలోకి ప్రవేశించాయి. వీరిని వెళ్లగొట్టేందుకు సౌదీకి సాయంగా పాక్ వాయుసేన పరిమిత దాడులు చేసింది. అయితే భూతల పోరాటంలో పాల్గొనలేదు. 1980ల నుంచి రియాద్, ఇస్లామాబాద్‌ల మధ్య స్నేహబంధం బలపడింది. ఆఫ్గాన్ ముజాహిదీన్‌లకు ఆర్థిక వనరులు సౌదీ నుంచి వచ్చేవి. పాక్ తాను కొంత తీసుకొని మిగిలినది ముజాహిదీన్‌లకు అందించేది. 2011లోనూ బహ్రెయిన్‌లో తిరుగుబాటు సందర్భంగా పాక్ దళాల సాయాన్ని సౌదీ అర్థించింది. ఇందుకు గాను కేవలం సైనిక సలహాదారులను మాత్రమే పాక్ పంపింది. 2015లో యెమెన్‌పై సౌదీ నేతృత్వంలో జరుగుతున్న దాడుల్లో పాక్ పాల్గొనబోదని ఆ దేశ పార్లమెంట్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. దీంతో సౌదీకి మళ్లీ ఆశాభంగమే కలిగింది.

**సౌదీ సాయం తీసుకున్నా..**

సౌదీ అరేబియా సుదీర్ఘకాలంగా పాక్‌ను పలు విధాలుగా ఆదుకుంటోంది. ఈ ఏడాదిలోనే 8 బిలియన్ డాలర్లను సాయంగా అందించింది. అంతకుముందు కాలంలోనూ భారీ సాయం చేసింది. ఎంత సాయం తీసుకున్నా పాక్ తన దుర్మార్గబుద్ధి మాత్రం విడిచిపెట్టబోదు అనే దానికి తాజా ఉదంతమే తార్కాణం.

# కాక్రోచ్ జనతా పార్టీకి అమెరికన్ల నుంచి నిధులు: సింగర్ ఆరోపణలు




కాక్రోచ్ జనతా పార్టీ కి తమ దేశంలోని కొందరు దాతలు నిధులు అందిస్తున్నారని అమెరికా సింగర్ మేరీ మిల్బెన్ ఆరోపించారు. ఇది మౌనంగా ఉండే సమయం కాదన్నారు. సీజేపీ విద్రోహ స్ఫూర్తికి వ్యతిరేకంగా భారత్‌లోని యువత శాంతియుతంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని దేశ రాజధాని దిల్లీలో విపక్షాలు, సీజేపీ ప్రతినిధులు నిరసన చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిల్బెన్ స్పందించారు. "25 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్న మీ ప్రధాని (మోదీ) మా దేశం నుంచి వచ్చే విద్రోహ శక్తుల ముందు తలవంచరు. కొందరు దాతలు ఉంటారు. వారు ప్రపంచస్థాయి సంప్రదాయ నేతలను లక్ష్యంగా చేసుకుంటారు. తర్వాత అమెరికాలో చదువుకున్న ఆయా దేశాలకు చెందిన వ్యక్తులను గుర్తిస్తారు. వారికి తీవ్రవాద భావాలను జొప్పించి, తమ తమ స్వదేశాలకు పంపుతారు. అక్కడ గందరగోళం, విధ్వంసం సృష్టించేందుకు నిధులు అందిస్తుంటారు. అయితే ఈ ప్రయత్నాల్లో ఎవరూ విజయవంతం కాలేదు. కానీ దేశ అభివృద్ధి, పాలనపై మాత్రం ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌లో చదువుకున్న యువత మేల్కొనాల్సిన సమయం వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను పరిరక్షించడం కోసం ఇలాంటి ఉద్యమాలకు ఎల్లప్పుడూ కౌంటర్ ఉండాలి" అని ఆమె ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ఆఫ్రికన్ అమెరికన్ అయిన సింగర్ మిల్బెన్.. భారత్‌కు సుపరిచితురాలే. మన జాతీయగీతం, 'ఓం జై జగదీశ హరే' పాటలతో మన దేశంలో ఆదరణ సొంతం చేసుకున్నారు.

# ప్రేమ, పెళ్లిళ్ల విషయంలో యువతకు ఒవైసీ కీలక సూచనలు

- **అమ్మాయి నచ్చితే పెళ్లి చేసుకున్నాకే 'ఐ లవ్ యూ' చెప్పాలని సలహా**
- **పెళ్లి తర్వాతే జీవితంలో స్థిరపడతారని, ముందు కాదని వ్యాఖ్య**
- **పెళ్లికాని వాళ్లతోనే సమస్యలంటూ విమర్శలు**



ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రేమ, పెళ్లి విషయంలో యువతకు ఆసక్తికరమైన సూచనలు చేశారు. ప్రేమ భావనలు వ్యక్తం చేసే కంటే ముందు పెళ్లికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. యువతకు ఎవరైనా అమ్మాయి నచ్చితే, ముందుగా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని, ఆ తర్వాతే ఆమెకు 'ఐ లవ్ యూ' చెప్పాలని సూచించారు. ఓ సభలో యువతను ఉద్దేశించి ఒవైసీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జీవితంలో పూర్తిగా స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటామని చెప్పే యువత తీరును ఆయన తప్పుబట్టారు. "సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకోవడం కాదు, పెళ్లి చేసుకుంటేనే జీవితంలో సెటిల్ అవుతారు" అని ఆయన స్పష్టం చేశారు. తన నెరిసిన గడ్డాన్ని చూపిస్తూ, "నా గడ్డం తెల్లబడింది, నేను ఇప్పటికీ పూర్తిగా సెటిల్ అవ్వలేదు. పెళ్లి చేసుకుంటే జీవితంలోని మిగతా అంశాలన్నీ అవే సర్దుకుంటాయి" అని సరదాగా వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు పూశాయి. పెళ్లి చేసుకోని వారు చుట్టుపక్కల వారికి సమస్యలు సృష్టిస్తారని, ఇంట్లో ఎవరూ లేనివారే అందరినీ ఇబ్బంది పెడతారని ఆయన వ్యాఖ్యానించారు. పెళ్లి చేసుకోవడం ద్వారా జీవితంలో స్థిరపడటం చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు.

# దసరాకు టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు.. 7 వేల ప్రత్యేక బస్సులు సిద్ధం

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీదేవి వెల్లడించారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని కొన్ని కీలక తేదీల్లో ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను 50 శాతం పెంచుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. అక్టోబరు 9, 10, 16, 17 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, తిరుగు ప్రయాణంలో అక్టోబరు 25, 26 తేదీల్లో ఈ పెరిగిన ఛార్జీలు వర్తిస్తాయి. అయితే, సాధారణ రోజుల్లో నడిచే బస్సుల ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యం అన్ని బస్సుల్లో యథావిధిగా కొనసాగుతుంది. ఈ 7 వేల ప్రత్యేక బస్సుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్‌కు 3,533 బస్సులు కేటాయించారు. హైదరాబాద్ జోన్‌కు 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు 1,312 బస్సులు నడుస్తాయి. వీటితో పాటు నల్గొండకు 815, మహబూబ్‌నగర్‌కు 645, రంగారెడ్డి రీజియన్‌కు 440, మెదక్‌కు 255 బస్సులు ఏర్పాటు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి అక్టోబరు 16న 1,354, 17న 1,211 బస్సులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు బయలుదేరనున్నాయి. ప్రయాణికుల కోసం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్‌బీ నగర్, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి వంటి ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పందిళ్లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్ల వంటి సౌకర్యాలను కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణికులు ముందుగానే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.



## నయనతార రాజకీయాల్లోకి వస్తారా..

**ప్రచారం పై భర్త విఘ్నేష్ శివన్ ఏమన్నారంటే!**

తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం పార్టీ చుట్టూ చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో.. సినీ తారలు నయనతార, త్రిష రాజకీయాల్లోకి వస్తారంటూ ప్రచారం మొదలైంది. ముఖ్యంగా 2031 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నాటికి నయనతార ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడతారనే ఊహాగానాలు వినిపించాయి. అయితే ఈ వార్తలపై నయనతార భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్ స్పందించారు. ప్రస్తుతం తమ దృష్టి పిల్లల పెంపకం, కుటుంబ బాధ్యతలు, వృత్తిపరమైన పనులపైనే ఉందని ఆయన పేర్కొన్నట్లు కథనాలు వెల్లడిస్తున్నాయి. కుటుంబంతో సమయం గడపడం, తమ పనులను సమర్థవంతంగా నిర్వహించడం తమకు సంతృప్తినిస్తోందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసారు. ఈ కామెంట్స్ నేపథ్యంలో నయనతార రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ప్రచారానికి ప్రస్తుతానికి ఎలాంటి స్పష్టమైన ఆధారం కనిపించడం లేదు. అయితే, ఆమె రాజకీయాల్లోకి వస్తారా లేదా అనే అంశంపై నయనతార నుంచి అధికారిక ప్రకటన వెలువడితేనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా, తమిళనాడులో సినీ రంగం, రాజకీయాలకు మధ్య సుదీర్ఘ అనుబంధం ఉంది. గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి సినీ ప్రముఖులు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఈ నేపథ్యంలో నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించడం, ఆయన పార్టీ కార్యకలాపాలు సినీ అభిమానుల్లోనే కాకుండా రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో నయనతార, త్రిష వంటి అగ్ర కథానాయికలు కూడా రాజకీయాల్లోకి వస్తారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, ప్రచారం ఒక్కటే రాజకీయ ప్రవేశానికి ఆధారం కాదని, సంబంధిత వ్యక్తుల అధికారిక ప్రకటనల కోసం వేచి చూడాల్సి ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. రాజకీయ ప్రవేశంపై ప్రచారం కొనసాగుతున్నప్పటికీ నయనతార ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్నారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు. ఆమె నటిస్తున్న పలు చిత్రాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న భక్తిరస ఫాంటసీ చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2'లో ఆమె అమ్మవారి పాత్రలో కనిపించనున్నారు. సుందర్ సి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో అంచనాలు ఉన్నాయి. ఇవే కాకుండా 'డియర్ స్టూడెంట్స్', పీరియడ్ యాక్షన్ డ్రామా 'రక్కాయి', 'మన్నంగట్టి సిన్స్ 1960' వంటి చిత్రాలతో అలరించేందుకు సిద్ధమైంది.

## ఎమోషనల్ లవ్‌స్టోరీకి సిద్ధం



గత రెండేళ్లుగా వరుస యాక్షన్ సినిమాలతో సందడి చేస్తూ వచ్చారు హీరో నాని. దసరా, హిట్ 3, ది ప్యారడైజ్.. ఇలా మాస్ యాక్షన్ మోడ్‌లో ఆయన చేసిన సినిమాలన్నీ భారీ విజయాలను అందుకున్నాయి. ప్రస్తుతం సుజీత్ దర్శకత్వంలో నటిస్తున్న 'బ్లడీరోమియో' సినిమాలో కూడా కొంతమేర యాక్షన్ ఉంటుందని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత నుంచి కథల ఎంపిక విషయంలో నాని పంథా మార్చనున్నారట. యాక్షన్ కథలను పక్కనపెట్టి, మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగపూరితమైన కథాంశాలపై ఆయన దృష్టిసారించనున్నట్టు అంతరంగిక వర్గాల భోగట్టా. ఈ క్రమంలోనే మధురమైన జ్ఞాపకాలను, చెప్పుకోలేని భావాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించే తమిళ దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో ఆయన ఓ ఎమోషనల్ ప్రేమకథలో నటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. 96, సత్యం సుందరం చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు డైరెక్టర్ ప్రేమ్ కుమార్. త్వరలో ఆయన నానితో చేయబోతున్న సినిమా కూడా భావోద్వేగాల మేళవింపుగా ఉంటుందని సమాచారం. ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీలో కథానాయిక పాత్ర కీలకమని టాక్. అందుకే ఆ పాత్ర కోసం చాలామంది కథానాయికలను పరిశీలించిన చిత్రబృందం చివరకు రుక్మిణి వసంత్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన రావాల్సివుంది.

## లంగా ఓణీలో ఇరుముడి సామ్..



మాస్ మహారాజ రవితేజ నటించిన ఇరుముడి సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ స్టోరీకి అయ్యప్ప స్వామి నేపథ్యాన్ని జోడించి శివ నిర్వాణ ఈ సినిమాను తెరకెక్కించాడు. ఆగస్టు 21న థియేటర్లలో రిలీజైన ఇరుముడి సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద 200 కోట్ల మేర కలెక్షన్లు సాధించింది. ముఖ్యంగా రవితేజ కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా ఇరుముడి నిలిచింది. కాగా ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటించింది. అలాగే రవితేజ కూతురి పాత్రలో బేబీ నక్షత్ర అద్భుతంగా నటించింది. సినిమాలో రవితేజ, నక్షత్ర మధ్య వచ్చే సన్నివేశాలు ఆడియెన్స్ ను బాగా ఆకట్టుకున్నాయి. కాగా ఇదే ఇరుముడి సినిమాలో మరో అమ్మాయి కూడా అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. గురు స్వామి సాయి కుమార్ కూతురు గాయత్రి పాత్రలో నటించిన అమ్మాయి తన క్యూట్ లుక్స్, యాక్టింగ్ తో అందరి ప్రశంసలు అందుకుంది. ఇరుముడి సినిమా తర్వాత ఈ అమ్మాయి క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఈ అమ్మాయి అసలు పేరు సామ్. గతంలో చాలా సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది. అయితే పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేక పోయింది. సుహాస్ హీరోగా నటించిన ప్రసన్న వదనం, బాలకృష్ణ నటించిన యాక్షన్ ఎంటర్ టైనర్ డాకు మహారాజ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది సామ్. ఇక మ్యాడ్ స్క్వేర్ సినిమాలోనూ మెరిసింది సామ్. అయితే ఇరుముడి సినిమాతో ఈ అమ్మడికి మంచి గుర్తింపు వచ్చింది. సోషల్ మీడియాలోనూ ఈ అమ్మాయికి ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే సామ్ తాజాగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. ఈ ఫొటోల్లో లంగా ఓణీలో చాలా ట్రెడిషనల్ గా క్యూట్ లుక్స్ లో కనిపించింది సామ్. వీటిని చూసిన నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. 'సో క్యూట్, బ్యూటిఫుల్' అంటూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు.

## పెళ్లి తర్వాత శోభిత ధూళిపాళ బోల్డ్ ఫోటోషూట్.. షాక్‌లో అక్కినేని అభిమానులు

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన కథానాయిక శోభిత ధూళిపాళ మరోసారి తన తాజా ఫోటోషూట్‌తో వార్తల్లో నిలిచారు. బాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న ఈ తెలుగమ్మాయి.. ఇప్పుడు అక్కినేని నాగచైతన్య భార్యగా కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా అంతర్జాతీయ మ్యాగజైన్ కోసం ఆమె చేసిన గ్లామరస్ ఫోటోషూట్ సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది. అంతర్జాతీయ మ్యాగజైన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' కోసం శోభిత ధూళిపాళ ప్రత్యేక ఫోటోషూట్ చేశారు. ఇందులో ఆమె బికినీతో పాటు దానిపై నెట్ తరహా దుస్తులను ధరించి కనిపించారు. ఈ ఫోటోలు బయటకు రావడంతో కొందరు ఆమె స్టైలిష్ లుక్‌ను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇంత బోల్డ్‌గా ఫోటోషూట్ చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ ఫోటోషూట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి శోభిత గతంలో 'మేడ్ ఇన్ హెవెన్', 'ది నైట్ మేనేజర్' వంటి వెబ్ సిరీస్‌లలో నటించారు. ఆయా కథలు, పాత్రలకు అనుగుణంగా ఆమె చేసిన కొన్ని బోల్డ్ సన్నివేశాలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత కూడా ఆ సన్నివేశాలు, గతంలో చేసిన ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో మరోసారి వైరల్ అయ్యాయి. తాజా ఫోటోషూట్‌పై కూడా కొందరు విమర్శలు చేస్తుండగా, మరికొందరు ఆమెకు మద్దతుగా స్పందిస్తున్నారు. ఒక నటిగా తనకు నచ్చిన పాత్రల్లో నటించడం, తన వృత్తిలో భాగంగా ఫోటోషూట్‌లు చేయడం వ్యక్తిగత నిర్ణయమని అభిప్రాయపడుతున్నారు. పెళ్లి తర్వాత మహిళల దుస్తులు, వృత్తిపరమైన ఎంపికలపై విమర్శలు చేయడం సరికాదని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో సమంత కూడా తన దుస్తులు, గ్లామరస్ ఫోటోషూట్‌ల విషయంలో ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్నారు. ఇప్పుడు శోభిత విషయంలోనూ ఇలాంటి చర్చ జరగడం గమనార్హం. ఇక సినిమాల విషయానికి వస్తే, శోభిత ప్రస్తుతం తమిళ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న 'వెట్టువమ్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలోని తన పాత్ర కోసం ఎంతో కష్టపడుతున్నానని, చాలాకాలంగా ఇలాంటి పాత్ర కోసం ఎదురుచూస్తున్నానని ఆమె గతంలో పేర్కొన్నట్లు కథనాలు వెల్లడించాయి.



## 56 షోలతో మొదలై సింగిల్ స్క్రీన్స్‌కి పండుగ తెచ్చిన 'ప్రేమనే ఊరిలో'



సినిమాలో దమ్ముంటే.. స్టార్ కాస్టింగ్ గురించి జనాలు పట్టించుకోరు. చిన్న చిత్రమా? పెద్ద చిత్రమా? అన్నది ప్రేక్షకులు చూడటం లేదిప్పుడు. 'ప్రేమనే ఊరిలో' (కన్నడలో 'ప్రేమాద ఊరలి') ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తోంది. మొదటి రోజు కేవలం 56 షోలు, 12 లక్షల కలెక్షన్లతో మొదలైన ప్రయాణం..

మూడో ఆదివారానికి ఏకంగా 1600 షోలు, సింగిల్ డేలోనే 13 కోట్లు కొల్లగొట్టే రేంజ్‌కి వెళ్లింది. చిన్న సినిమాలకు 10 కోట్లు రావడమే గగనమైన ఈ రోజుల్లో కేవలం 3 వారాల్లో 78 కోట్లు సాధించి బాక్సాఫీస్ హిస్టరీని తిరగరాసింది. థియేటర్ల ముందు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. జనాన్ని కంట్రోల్ చేయడానికి పోలీసులే దిగాల్సి వస్తోంది. "మా జీవితకాలంలో ఇలాంటి ఉత్సవం చూడలేదు" అని సింగిల్ స్క్రీన్ ఓనర్లు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి ప్రముఖ సంస్థల నుంచి భారీ ఆఫర్లు వచ్చినప్పటికీ థియేట్రికల్ రన్ కోసం చిత్ర బృందం ఏ డీల్‌నూ అంగీకరించలేదు.

అంతేకాకుండా తాము ఎలాంటి ఓటీటీ ఒప్పందం కూడా కుదుర్చుకోలేద[illegible] చేస్తూ మేకర్స్ అధికారికంగా ఒక ప్ర[illegible] విడుదల చేశారు. అక్టోబర్ 2న తె[illegible] ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చి[illegible] అద్భుతమైన సమీక్షలు దక్కాయి. [illegible] మాతృక తరహాలోనే ఇక్కడ కూడ[illegible] టాక్‌తోనే లాంగ్ రన్‌లో ఈ చిత్రం సు[illegible]ట్ దిశగా వెళ్తోంది. ఈరోజుల్లో ఓటీ[illegible] కోసమే సినిమాలు తీస్తున్నారు. అ[illegible] కేవలం థియేట్రికల్ రన్ కోసం భా[illegible] డీల్స్ వదులుకుని 'ప్రేమనే ఊరి[illegible] అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.